క్లుప్తంగా

ప్రజా సంక్షేమమే మోదీ లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

ఆమనగల్లు: ప్రజా సంక్షేమమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని, 11 ఏళ్లుగా ప్రధాని మోదీ సాధించిన విజయాలను పార్టీ శ్రేణులు ప్రజలకు వివరించాలని బీజేపీ జిల్లా నాయకుడు బండెల రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం విఠాయిపల్లి గ్రామంలో వికసిత్‌భారత్‌లో భాగంగా నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ దేశానికి సుపరిపాలన అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు కర్నాటి విక్రంరెడ్డి, బూత్ కమిటీ అధ్యక్షుడు ప్రవీణ్‌రెడ్డి, నాయకులు నర్సింహ, లక్ష్మణ్, కృష్ణనాయక్, రాములునాయక్, రవిరాథోడ్, రాములు, జగన్‌రెడ్డి, సాయిబాబా, లక్ష్యనాయక్ తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుల కుటుంబాలకు బాల్య మిత్రుల బాసట



అశోక్ కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న స్నేహితులు

యాచారం: స్నేహితుల కుటుంబాలకు కలిసి చదువుకున్న బాల్యమిత్రులు ఆర్థిక సహాయం అందజేసి అండగా నిలిచారు. వివరాలు ఇలా ఉన్నాయి. అయ్యవారిగూడం గ్రామానికి చెందిన కొప్పు అశోక్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న 2001-2002 ఏడాది పదో తరగతి బాల్యమిత్రులు.. ఆదివారం మృతుడి కుటుంబానికి రూ.లక్ష నగదు అందజేశారు. అదే విధంగా నందివనపర్తి గ్రామానికి చెందిన గోగికార్ జ్ఞానేశ్వర్ అనారోగ్యంతో మృతి చెందాడు. 1990- 91 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు.. మృతుడి కుటుంబీకులకు రూ.54,400లు ఆర్థిక సహాయం అందజేశారు. భవిష్యత్తులో అండగా ఉంటామని ఇరు కుటుంబాలకు భరోసా ఇచ్చారు.

బీజేపీ గ్రామ కన్వీనర్‌గా శేఖర్ గౌడ్



నూతన సభ్యులతో నాయకులు

మంచాల: బీజేపీ ఆరుట్ల గ్రామ శాఖ కన్వీనర్‌గా కొత్తపల్లి శేఖర్‌గౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని ఆ పార్టీ మండల అధ్యక్షుడు నూకం రాజు ముదిరాజ్ తెలిపారు. ఆదివారం గ్రామంలో నిర్వహించిన విస్తృతస్థాయి సమావేశంలో కన్వీనర్‌గా శేఖర్ గౌడ్, జాయింట్ కన్వీనర్‌గా మెండు శ్రీనివాస్‌రెడ్డిని నియమించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు జంగయ్య గౌడ్, జనార్దన్‌రెడ్డి, సుదర్శన్ రెడ్డి, వెంకట్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, నర్సింహారెడ్డి, మహేందర్ గౌడ్, సత్తిరెడ్డి, శేఖర్‌రెడ్డి, నరేందర్ గౌడ్, రమేష్, మల్లేశ్, శేఖర్, కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి సహకరించాలి



ఎంపీ మల్లురవికి వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కడ్తాల్: మండల అభివృద్ధికి సహకరించాలని ఎంపీ డాక్టర్ మల్లురవిని పీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ రాములుగౌడ్ కోరారు. ఆదివారం నగరంలోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. కడ్తాల్ మండల కేంద్రంలో అసంపూర్తిగా నిలిచిన ఎంపీడీఓ భవన నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేయాలని కోరగా, తన నిధుల నుంచి రూ.50 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ఎంపీ ప్రకటించారని వారు తెలిపారు. అదే విధంగా పాలశీతలీకరణ కేంద్రం ఆవరణలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ భవనం ప్రారంభించాలని కోరగా, టీఎస్‌డీడీసీఎఫ్ ఎండీ చంద్రశేఖర్‌రెడ్డితో ఎంపీ ఫోన్లో మాట్లాడారని, త్వరగా ప్రారంభించాలని ఆదేశించినట్లు వారు పేర్కొన్నారు.

ప్రమాదం అంచున ప్రయాణం

అస్తవ్యస్తంగా డివైడర్లు
- అడ్డదిడ్డంగా పడిపోయిన బారికేడ్లు
- హైవేలపై ఇష్టానుసారంగా వాహనాల పార్కింగ్
- పట్టించుకోని అధికారులు



సాగర్ రహదారిపై బ్రాహ్మణపల్లి కూడలిలో పడిపోయిన బారికేడ్లు

తుర్కయంజాల్/ అబ్దుల్లాపూర్‌మెట్: అవీ జాతీయ రహదారులు. భారీ వాహనాల రాకపోకలతో కిటకిటలాడుతుంటాయి. ఇలా నిత్యం రద్దీగా ఉండే రోడ్లలో ప్రమాదాలూ.. పొంచి ఉన్నాయి. ఓ ప్రాంతంలోని హైవే మధ్యలో డివైడర్లు లేవు. ఉన్నా అవి లేనట్లే. కూడలి, యూటర్నుల వద్ద ప్రమాదాల నివారణకు అడ్డుగా పెట్టిన బారికేడ్లు అడ్డదిడ్డంగా పడిపోయి మరింత ప్రమాదకరంగా మారాయి. అయినప్పటికీ.. వాటిని సరిచేసే వారు లేరు. తొలగించే వారు కరువు. మరో ప్రాంతంలో రోడ్డుకు వ్యతిరేక దిశలో అడ్డదిడ్డంగా నిలిపిన వాహనాలు. ఇవన్నీ చిన్నవే అనిపించినా.. ఇవేమీ పట్టించుకోని వాహనచోదకులు ఏమాత్రం ఆదమరచినా భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు.

గాలిలో ప్రయాణికుల ప్రాణాలు

తుర్కయంజాల్ సాగర్ రహదారిపై పలు చోట్ల బారికేడ్లు పడిపోయి, వీధి దీపాల స్తంభాలు కూలిపోయి ప్రమాదకరంగా మారాయి. ఇలా నిరంతరం రద్దీగా ఉండే హైవేపై.. మున్సిపల్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు నిర్వాహణ, భద్రతా చర్యలు మరచి, ప్రయాణికుల ప్రాణాలను గాలిలో దీపంలా చేశారు. వారి నిర్లక్ష్యం కారణంగా తరచుగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ ఘటనల్లో పలువురు పలువురు మృతి చెందగా.. అనేక మంది.. తీవ్రగాయాల పాలై అంగవైకల్యం బారిన పడినట్లు స్థానికులు పేర్కొంటున్నారు.

చర్యలు తీసుకుంటాం

బారికేడ్లు పడిపోయిన విషయం మా దృష్టికి రాలేదు. వెంటనే వాటిని సరిచేయిస్తాం. అదే విధంగా పడిపోయిన విద్యుత్ స్తంభాన్ని తొలగిస్తాం. సాగర్ రహదారిపై పలు చోట్ల ప్రమాదకరంగా ఉన్న వాటిని తొలగిస్తాం. ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటాం.

– కె.అమరేందర్ రెడ్డి, కమిషనర్, తుర్కయంజాల్

పెనవేసుకున్న నిర్లక్ష్యం



ఇంజాపూర్‌లో వేంకటేశ్వర హెచరీస్ సమీపంలో విరిగిన విద్యుత్ స్తంభం

బ్రాహ్మణపల్లి చౌరస్తాలో తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. వాటి నివారణకు బారికేడ్లు అడ్డుగా పెట్టి, కూడలిని మూసివేశారు. అలా ప్రమాదాల నివారణకు ఏర్పాటు చేసినవి కాస్త ఇప్పుడు.. రోడ్డుపై పడిపోయి ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. వాహనచోదకులు ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదం బారిన పడక తప్పదు. ఇదే అదనుగా భావించిన కొందరు ద్విచక్రవాహనదారులు వీటి మధ్యలో నుంచే రోడ్డు క్రాస్ చేస్తున్నారు. డివైడర్ లేని దగ్గర ఇలా ద్విచక్రవాహనాలు ఉన్నఫలంగా వ్యతిరేకదిశకు వస్తున్న నేపథ్యంలో ఇతర వాహనదారులు ప్రమాదంలో పడే అవకాశం లేకపోలేదు. ఇక ఇంజాపూర్‌లో వేంకటేశ్వర హెచరీస్ సమీపంలో రహదారిపై వీధి దీపాల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో రోడ్డుపైనే పడుంది. –తుర్కయంజాల్ చౌరస్తాలో రోడ్డుకు అడ్డంగా ఏర్పాటు చేసిన రెండు డివైడర్ సిమెంట్ దిమ్మెలను అలాగే వదిలేశారు. – రాగన్నగూడలో డివైడర్ మధ్యలో ప్రకటనల కోసం ఏజెన్సీ వారు రోబో సాండ్‌ను పోసి వదిలేశారు.

రాత్రివేళలో ప్రమాదాలు



బాటసింగారం సర్వీస్ రోడ్డుపై అడ్డంగా నిలిపిన భారీ వాహనాలు

అబ్దుల్లాపూర్‌మెట్ విజయవాడ జాతీయ రహదారిపై వాహనదారుల నిర్లక్ష్యం పెనవేసుకుంది. ఇష్టానుసారంగా సర్వీస్ రోడ్డుపై వాహనాలు పార్కింగ్ చేస్తూ.. ఇతరులకు ఇబ్బందిగా మారారు. ఈ హైవేపై ఇరువైపులా దాబాలు, హోటళ్లు నిరంతరం కొనసాగుతుంటాయి. ఇక్కడ వాహనదారులు తమ ఆకలిని తీర్చుకునేందుకు సర్వీస్ రోడ్డుపై తమ బండ్లను నిలుపుతుంటారు. దీంతో పగటి పూట ఎలా ఉన్నా.. రాత్రివేళలో ప్రమాదాలు జరిగే అవకాశం లేకపోలేదు. హయత్‌నగర్ నుంచి వార్డ్ అండ్ డీడ్, లక్ష్మారెడ్డిపాలెం, పెద్దఅంబర్‌పేట చెక్‌పోస్ట్, ఔటర్ రింగ్‌రోడ్డు, గండిమైసమ్మ దేవాలయం ఎదుట, అబ్దుల్లాపూర్‌మెట్ మయూరి కాంట, ఇనాంగూడ, బాటసింగారం మౌంట్ ఒపేరా, కొత్తగూడెం ప్రాంతాల్లో రెండు వైపులా ఉన్న సర్వీస్ రోడ్డుపై అడ్డదిడ్డంగా పార్కింగ్ చేస్తున్నారు. ఇలా ఎక్కడ పడితే అక్కడ వెహికల్స్ నిలిపివేతతో ఇతర వాహనదారులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని, సంబంధిత అధికారులు స్పందించి, వాటిని నివారించాలని పలువురు కోరుతున్నారు.

కష్టపడిన వారికే గుర్తింపు

- పార్టీ బలోపేతానికి కృషి చేయండి
- స్థానిక ఎన్నికలకు సిద్ధంగా ఉండండి
- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరులు

యాచారం: పార్టీ బలోపేతం కోసం శ్రమించే వారికి, ప్రజల్లో గుర్తింపు ఉన్నవారికి మాత్రమే స్థానిక ఎన్నికల్లో టికెట్లు లభించే అవకాశం ఉందని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. రానున్న ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని, అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరు పనిచేయాలని సూచించారు. యాచారం మండలం తమ్మలోనిగూడ గ్రామానికి చెందిన పీఏసీఎస్ డైరెక్టర్ అయిలయ్యతో పాటు పలువురు బీఆర్ఎస్ శ్రేణులు ఆదివారం నగరంలోని ఎమ్మెల్యే నివాసంలో ఆయన సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పార్టీ శ్రేణులు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై విస్తృతంగా ప్రచారం చేయాలని, ప్రజలకు వివరించాలని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహ, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు రాంరెడ్డి, కె.శ్రీనువాస్ రెడ్డి, బీఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్, సీనియర్ నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు లక్ష్మీపతిగౌడ్, అరవింద్‌నాయక్, వెంకట్‌రెడ్డి, కర్రె బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

మండల పరిధి పలు గ్రామాల్లో సోమవారం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పర్యటించనున్నారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహ తెలిపారు. ఉదయం 11 గంటలకు మంతన్‌గౌరెల్లిలో ప్రారంభమై మాల్, నల్లవెల్లి, చింతపట్ల, తమ్మలోనిగూడ గ్రామాల మీదుగా ఎమ్మెల్యే పర్యటన కొనసాగుతుందని, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేయనున్నారని పేర్కొన్నారు.

బీసీ రిజర్వేషన్లు పెంచాకే ఎన్నికలు



జ్యోతిరావు పూలే విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కడ్తాల్: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచిన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కంబాల పరమేష్ డిమాండ్ చేశారు. రిజర్వేషన్లపై స్పష్టత ఇవ్వకుండా ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తుందని పేర్కొన్నారు. బీసీలను మరోసారి మోసం చేయడానికి సర్కార్ పావులు కదుపుతుందని ఆరోపించారు. రిజర్వేషన్లు కల్పించిన తరువాతే ఎన్నికలకు వెళ్లాలంటూ ఆదివారం మండల కేంద్రంలో ప్రజా సంఘాల నాయకులతో కలిసి మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద నిరసన వ్యక్తంచేశారు. విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. రిజర్వేషన్లు అమలు చేయకపోతే.. కాంగ్రెస్ ప్రభుత్వానికి బీసీలు తగిన బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాఘవేందర్, నాయకులు సిద్ధిగారి దాసు, క్యామ వెంకటేశ్, మహేశ్, యాదయ్య, అంజి, సురేశ్, కుమార్, సురేశ్ తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై నిరంతర పోరాటం

ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందంగౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న సదానందంగౌడ్

ఆమనగల్లు: ఉపాధ్యాయుల సమస్యలపై ఎస్టీయూటీఎస్ నిరంతరం పోరాటం చేస్తుందని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందంగౌడ్ అన్నారు. పట్టణంలోని సంఘం కార్యాలయాన్ని మాజీ ఎమ్మెల్సీ కత్తి నర్సింహారెడ్డి, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి సదయ్య, సంఘం రాష్ట్ర నాయకుడు కసిరెడ్డి పురుషోత్తంరెడ్డిలతో కలిసి ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం సదానందం మాట్లాడుతూ.. ఉద్యోగ, ఉపాధ్యాయుల సంఘాలతో రాష్ట్ర మంత్రివర్గ ఉపసంఘం జరిపిన చర్చల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ విరమణ పొందిన వారికి రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. హెల్త్‌కార్డులు, పీఆర్సీ, పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలని కోరారు. లేనిపక్షంలో ఎస్టీయూ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. అనంతరం సంఘం నాయకులు.. ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి పాండు రంగారెడ్డి, నాయకులు పరమేశ్, గణేశ్, సుధాకర్, కృష్ణారెడ్డి, భార్గవి, మండల అధ్యక్షుడు కసిరెడ్డి అశోక్‌రెడ్డి, మాడ్గుల అధ్యక్షుడు నవీన్, తలకొండపల్లి అధ్యక్షుడు క్రాంతికుమార్, నాయకులు అబ్దుల్ రజాక్, శ్రీలత, సుజాత పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం అంతారం గ్రామానికి చెందిన ఎండీ ఆరిఫ్ కూతురు సమ్రిన్‌బేగం గుండె శస్త్ర చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయనిధి పథకం కింద రూ.5 లక్షలు మంజూరయ్యాయి. ఈ మేరకు ఆదివారం నగరంలోని తన నివాసంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి.. బాధితులకు చెక్కు అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి, సింగిల్ విండో మాజీ చైర్మన్ అంజయ్యగౌడ్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసమూర్తి, మాజీ సర్పంచ్ రమేశ్‌యాదవ్, మాజీ ఉపసర్పంచ్ అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల కోసం పనిచేసేది కమ్యూనిస్టులే

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రజల కోసం నిస్వార్థంగా పని చేసేది కమ్యూనిస్టులు మాత్రమేనని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కాడిగళ్ల భాస్కర్ అన్నారు. ఆదివారం ఇబ్రహీంపట్నం మండలం తులేకలాన్ గ్రామంలో పార్టీ గ్రామస్థాయి రాజకీయ శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ కంటే ముందుగానే దేశానికి స్వరాజ్యం కావాలని, బ్రిటీష్ రాజ్యం పోవాలని డిమాండ్ చేసింది కమ్యూనిస్టులేనని తెలిపారు. జిల్లా స్థాయి శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని పార్టీ నాయకుడు సామేలు కోరారు. ఈ నెల 24 నుంచి 26 వరకు బాగ్‌లింగంపల్లిలో జరిగే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్, మండల కార్యదర్శి బుగ్గరాములు, జిల్లా నాయకులు కిషన్, జగన్, నాయకులు రమేష్, రవీందర్, భాస్కర్, స్కైలాబ్, అశోక్, మహేశ్, ప్రభాకర్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం.. ప్రాణదానంతో సమానం



దాతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న నిర్వాహకులు

తుర్కయంజాల్: రక్తదానం.. ప్రాణదానంతో సమానమని మున్సిపల్ కమిషనర్ కె.అమరేందర్ రెడ్డి అన్నారు. ప్రతిరోజు ఒకచర్య- ఒకమార్పు అనే కార్యక్రమంలో భాగంగా మానవ సేవే మాధవ సేవగా భావించి ఆదివారం పురపాలక సంఘం, సెయింట్ ఫాల్స్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ, ప్రతిమ సాయి బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో సంయుక్తంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రమాదాలు జరిగినప్పుడు, సరైన సమయంలో రక్తం అందక విలువైన ప్రాణాలు పోతున్నాయని తెలిపారు. దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ కిరణ్మయి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ వినయ్ ఉన్నారు.

పారిశుద్ధ్యం.. అస్తవ్యస్తం

- రోడ్లపైనే పారుతున్న మురుగునీరు
- దుర్వాసనతో ఇబ్బంది పడుతున్న స్థానికులు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు



భరద్వాజ్ కాలనీలో ఇళ్ల ఎదుట పారుతున్న మురుగునీరు



స్టార్ కాలనీలో రోడ్డు పక్క నుంచి కాల్వలా పారుతున్న మురుగునీరు

మొయినాబాద్: మున్సిపాలిటీలో మురుగునీటి పారుదల అస్తవ్యస్తంగా మారింది. సరైన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరు రోడ్లపైనే పారుతోంది. మున్సిపల్‌లోని భరద్వాజ్ కాలనీ, సహారా కాలనీ, స్టార్ కాలనీ, విజయనగర్ కాలనీల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు ఏర్పాటు చేయలేదు. ఆయా కాలనీల లేఅవుట్ చేసినప్పుడే వెంచర్ చేసినవారు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, రోడ్లు వేయాల్సి ఉన్నా అప్పట్లో అవేవి పట్టించుకోలేదు. లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకున్న తర్వాత ఇబ్బందులు మొదలయ్యాయి. ఆయా కాలనీల్లో గత ఐదేళ్లలో కొత్తగా ఇళ్ల నిర్మాణాలు అధికంగా జరిగాయి. ఆ ఇళ్ల నుంచి వచ్చే మురుగు నీరంతా రోడ్ల పైన, పక్క నుంచి కాలువలుగా పారుతుండడంతో దుర్వాసన, ఈగలు, దోమలతో రోగాలు వస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా మున్సిపాలిటీ పరిధిలోని హిమాయత్ నగర్, ఎన్కేపల్లి, అజీజ్‌నగర్, చిలుకూరు, పెద్దమంగళారం గ్రామాల్లో సైతం పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. మున్సిపల్ పరిధిలో పరిస్థితి దారుణంగా ఉన్నా అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించాలని కోరుతున్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యత



మురుగు కాల్వ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న నాయకులు

కడ్తాల్: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ అన్నారు. మండల పరిధి కర్కల్‌పహాడ్ గ్రామంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో.. సీడీఎఫ్ నిధులు రూ.4 లక్షలతో నిర్మించ తలపెట్టిన అంతర్గత మురుగు కాల్వల నిర్మాణానికి ఆదివారం వారు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో నాయకులు విష్ణువర్ధన్, వీరయ్య, పట్నం కృష్ణ, స్కైలాబ్, అర్జున్, మహేందర్, రవి, శ్రీను, రాజేందర్‌రెడ్డి, అశోక్, రాజు, జలాలుద్దీన్, వెంకటేశ్, శివరాజు, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

తండా రోడ్డుకు మరమ్మతు పనులు



రోడ్డుకు మరమ్మతు పనులు చేయిస్తున్న గ్రామస్తులు

మంచాల: వర్షాలకు అధ్వానంగా మారిన బండలేమూర్- పోర్లగడ్డ తండా రోడ్డుకు ఆదివారం గ్రామస్తులు జేసీబీ సహాయంతో మరమ్మతు చేయించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్‌లు పోచమోని కృష్ణ, మంగ శ్రీనివాస్ మాట్లాడుతూ.. రంగారెడ్డి –యాదాద్రి జిల్లాల సరిహద్దు గ్రామాల ప్రజల రాక పోకలకు ఈ మార్గం ఎంతో ఉపయోగకరమైందని తెలిపారు. ఈ రోడ్డును బీటీరోడ్డుగా నిర్మించి, రవాణా సౌకర్యం మెరుగు పర్చాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కోరారు. అదేవిధంగా యాథావిధంగా ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో నుంచి బండలేమూర్- పోర్లగడ్డతండాకు బస్సును నడిపించాలని సంస్థ అధికారులను కోరారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఆమనగల్లు: ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

ఆమనగల్లు: పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది. ఆమనగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2013- 14 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న బాల్యమిత్రులు.. పుష్కర కాలం అనంతరం ఆదివారం ఓ ఫంక్షన్‌హాల్‌లో సందడి చేశారు. నాటి జ్ఞాపకాలను గుర్తుకు చేసుకుంటూ కేరింతలు కొట్టారు. ఆప్యాయంగా పలకరించుకుంటూ క్షేమసమాచారం తెలుసుకున్నారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన గురువులు శేశిరెడ్డి, మహాలింగం, కురుమూర్తి, ఉమారాణి, సుశీల, జాస్మిన్‌లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు శివ, నర్సింహ, ప్రదీప్, మౌనిక, శ్రీరామ్, మహేందర్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

మాడ్గులలో..



మాడ్గులలో..

మాడ్గుల: మండల పరిధి కొల్కులపల్లి జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2000- 2001 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న బాల్యమిత్రులు ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాటి జ్ఞాపకాలను గుర్తుకు చేసుకుంటూ సందడి చేశారు. ఆప్యాయంగా పలకరించుకున్నారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బట్టు కిషన్ రెడ్డి, ఉపాధ్యాయులు బుచ్చయ్య, సంజీవన్ రావు, సూర్యప్రకాష్, హకీమ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
బి. కిరణ్‌కుమార్
9912220386